

# హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

## దేశంలోని ఆరు ప్రధాన మహానగరాల్లో భాగ్యనగరం ఒకటి

- ముందస్తు వ్యూహంలో భాగంగానే హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించాం
- గాజులరామారంలో అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్
- పేదలకు లక్ష ఎల్ఐజీ, ఎమ్ఐజీ ఇళ్ల నిర్మాణానికి పక్కా ప్రణాళిక
- గత బీఆర్ఎస్, కేంద్ర బీజేపీల పాలనపై బహిరంగ చర్చకు సిద్ధం
- రాబోయే 24 నెలలు అభివృద్ధికే అంకితం
- సబర్మతిని మెచ్చే వారు మూసీని ఎందుకు అడ్డుకుంటున్నారు?
- బీజేపీ ఎంపీలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నలు

**రంగారెడ్డి, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** "దేశ ఆర్థిక వ్యవస్థకు పటిష్టమైన వెన్నెముకగా నిలుస్తూ దేశాన్ని నడిపిస్తున్న ఆరు ప్రధాన మహానగరాల్లో హైదరాబాద్ అత్యంత కీలకమైనది. ఢిల్లీలో కాలుష్యం, ముంబైలో వర్షాకాల ముంపు, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా నగరాల్లో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. భవిష్యత్తులో అలాంటి గడ్డు పరిస్థితులు మన హైదరాబాద్‌లో తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో కూడిన సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోంది" అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మియాపూర్‌లో నిర్వహించిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జెండాలు, రాజకీయ ఎజెండాలకు పూర్తిగా అతీతంగా నగర ప్రగతికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు.

హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడానికే నగరాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. శాంతిభద్రతల పరిరక్షణ, మున్సిపల్ సేవల్లో పారదర్శకత కోసం పోలీస్, మున్సిపల్ శాఖల మధ్య పటిష్టమైన సమన్వయం మెరుగుపడేలా ఈ పరిపాలనా సరిహద్దులను శాస్త్రీయంగా నిర్ణయించామని చెప్పారు.

**విద్య, గృహ నిర్మాణం, మహిళా సాధికారతకు పెద్దపీట**

పేద కుటుంబాల పిల్లలకు అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

మిగతా2లో...

### మెట్రో రెండో దశ.. గాజులరామారంలో అంతర్జాతీయ బస్ టెర్మినల్

హైదరాబాద్ అంతర్జాతీయంగా 'విశ్వనగరం'గా ఎదగాలంటే అందుకు తగిన అత్యాధునిక మౌలిక వసతులు ఎంతో అవసరమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగానే మెట్రో రెండో దశ విస్తరణ పనులను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. నగర రవాణా రంగాన్ని విప్లవాత్మకంగా మార్చేందుకు గాజులరామారంలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయి అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మించనున్నట్లు సంచలన ప్రకటన చేశారు. రాబోయే మూడు నెలల్లోనే ఈ మెగా ప్రాజెక్టుకు సంబంధించిన క్షేత్రస్థాయి పనులను ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.




## కాంగ్రెస్ హయాంలో కోల్ అంటే అవినీతి

- నేడు మోదీ పాలనలో సుపరిపాలనకు ప్రతీక
- 12 ఏళ్లలో బొగ్గు, గనుల రంగంలో విప్లవాత్మక సంస్కరణలు
- తెల్లకాగితం కేటాయింపుల నుంచి పారదర్శక వేలం విధానం
- ఒక్క అక్రమానికి తావులేకుండా రీవ్యాంప్
- ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారుగా భారత్
- గతేడాది రికార్డు స్థాయిలో బిలియన్ టన్నుల ఉత్పత్తి
- బొగ్గు దిగుమతులు 4% తగ్గింపు.. రూ. 60 వేల కోట్ల ప్రజాధనం ఆదా
- రూ. 46,000 కోట్ల ప్రోత్సాహకాలతో 'కోల్ గ్యాసిఫికేషన్'..
- జూన్ 11న హైదరాబాద్‌లో భారీ రోడ్‌షో : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

2

## 'ఏఐసీసీ' కాదు 'ఆల్ ఇండియా నాజీ పార్టీ'

- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఫాసిస్ట్ పోకడలు
- ఢిల్లీలో రాజ్యాంగ రక్షకుడిగా ఫోజులిచ్చే రాహుల్ ఎందుకు మౌనం?
- 'మొహబ్బత్ కీ దుకాన్' కాస్తా తెలంగాణలో 'హిట్లర్ కా మకాన్' అయిందా..?
- ప్రజాస్వామ్య నాయకుడు రాజనీతిజ్ఞుల నుంచి స్ఫూర్తి పొందుతాడు
- అధికారం తలకెక్కినవాడే నియంతలను మొక్కుతాడు
- రేవంత్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలపై 'ఎక్స్' వేదికగా కేటీఆర్ సంచలన పోస్ట్



2



## కాంగ్రెస్‌ది హిట్లర్ మనస్తత్వమే

- విపరీత పోడకలతో రేవంత్ రెడ్డి ఆలోచనలు
- ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం శుద్ధ అబద్ధాలు
- దేశం మొత్తం ధాన్యం సేకరణలో సగానికి పైగా తెలంగాణ నుంచే
- ధాన్యం కొనుగోళ్ల వివరాలు ఎఫ్‌సీఐ పోర్టల్‌లో స్పష్టంగా ఉన్నాయి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫడ్నవీస్ అపాయింట్‌మెంట్ అడగలేదు
- అప్పుడే కిషన్ రెడ్డిపై బురదజల్లడం మొదలు పెట్టారు
- పాలమూరు-రంగారెడ్డిని కాంగ్రెస్ 'ఏటీఎం'గా మార్చుకుంటోంది!
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తీవ్ర ధ్వజం!

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** "తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మనస్తత్వమే ముమ్మాటికీ హిట్లర్ మనస్తత్వం. రాజ్యాంగం, రాజ్యాంగ వ్యవస్థలు, ప్రజాస్వామ్య సంస్థల మీద కాంగ్రెస్ పార్టీకి మొదటి నుండి ఎలాంటి నమ్మకం లేదు. అందుకే ఆనాడు ఇందిరాగాంధీ గారు దేశంలో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని నలిపేసారు.

మిగతా2లో...



# కాంగ్రెస్ హయాంలో కోల్ అంటేనే అవినీతి

- నేడు మోదీ పాలనలో సుపరిపాలనకు ప్రతీక
- 12 ఏళ్లలో బొగ్గు, గనుల రంగంలో విప్లవాత్మక సంస్కరణలు
- తెల్లకాగితం కేటాయింపుల నుంచి పారదర్శక వేలం విధానం
- ఒక్క అక్రమానికి తావులేకుండా రీవ్యాంప్
- ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారుగా భారత్
- గతేడాది రికార్డు స్థాయిలో బిలియన్ టన్నుల ఉత్పత్తి
- బొగ్గు దిగుమతులు 4% తగ్గింపు.. రూ. 60 వేల కోట్ల ప్రజాధనం ఆదా
- రూ. 46,000 కోట్ల ప్రోత్సాహకాలతో 'కోల్ గ్యాసిఫికేషన్'..
- జూన్ 11న హైదరాబాద్‌లో భారీ రోడ్‌షో : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** గత యూపీయే కాంగ్రెస్ హయాంలో 'కోల్' (బొగ్గు) అంటే కేవలం అడ్డగోలు అవినీతి, తీవ్ర అసమర్థతకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేదని, నాటి బొగ్గు కుంభకోణాల కారణంగా ఏకంగా కేంద్ర బొగ్గు మంత్రే జైలుకు వెళ్లిన చరిత్ర దేశానికి తెలుసని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు. నాడు తెల్లకాగితం పైన రాసిస్తే చాలు బొగ్గు గనులను అక్రమంగా కేటాయించేవారని దుయ్యబట్టారు. 2014లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రారంభమైన సుపరిపాలన, ఆత్మనిర్భర భారత నిర్మాణ యజ్ఞం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో.. నేడు బొగ్గు, గనుల రంగం పారదర్శకతకు నిలువెత్తు ప్రతీకగా నిలిచిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటిస్తూ, గత 12 ఏళ్లలో ఒక్క అక్రమానికి కూడా తావులేకుండా ఈ రంగాన్ని పూర్తిగా రీవ్యాంప్ చేశామని ఆయన సగర్వంగా ప్రకటించారు. బొగ్గు, గనుల రంగంలో గడిచిన 12 ఏళ్లలో వచ్చిన గణనీయమైన మార్పులు, సాధించిన విజయాలను వివరిస్తూ సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు.

**ఆర్థిక వ్యవస్థకు, రైల్వేలకు బొగ్గు రంగమే వెన్నుముక!**

దేశ ఆదాయం, ఉపాధి కల్పనలో బొగ్గు, గనుల రంగం పాత్ర అత్యంత కీలకమైనదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ రంగం ద్వారా దేశంలో 5 లక్షల మందికి ప్రత్యక్షంగా, మరో 25 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోందన్నారు. రైల్వేలకు అత్యధిక లాభాలు తెచ్చిపెట్టే గూడ్స్ రవాణాలో ఏకంగా 51 శాతం వాటా ఒక్క బొగ్గు రవాణా ద్వారానే లభిస్తోందని, దీని ద్వారా రైల్వేలకు ఏడాదికి దాదాపు రూ. 90,000 కోట్ల ఆదాయం అందుతోందని వెల్లడించారు. గత కాంగ్రెస్ హయాంలో దేశంలో తీవ్ర విద్యుత్ కొరత ఉండేదని గుర్తు చేస్తూ.. నేడు మోదీ సంస్కరణల వల్ల దేశవ్యాప్తంగా నిరంతరాయంగా విద్యుత్ అందిస్తున్నామని, ప్రస్తుతం దేశంలోని మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో 72 శాతం వాటా బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్ల ద్వారానే జరుగుతోందని చెప్పారు.

**గ్లోబల్ లీడర్‌గా భారత్.. రూ. 60,000 కోట్లు ఆదా!**

ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారుగా, రెండో అతిపెద్ద వినియోగదారుగా రికార్డు సృష్టించిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. మన దేశంలో ప్రపంచంలోనే 5వ అతిపెద్ద బొగ్గు నిల్వలు ఉన్నాయన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని 'గెవరా' మైన్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద కోల్ మైన్ కాగా, 'కుస్ముందా' 4వ అతిపెద్ద బొగ్గు గనిగా నిలిచాయని, 'కోల్ ఇండియా' ప్రపంచంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థగా రికార్డులకెక్కిందని తెలిపారు. ప్రస్తుతం దేశంలో 426 గనుల ద్వారా బొగ్గు వెలికితీత జరుగుతోందని, గడిచిన రెండేళ్లుగా రికార్డు స్థాయిలో ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధిస్తున్నామని ప్రకటించారు. ఈ ఉత్పత్తి ప్రక్రియను ప్రధాని మోదీ ప్రతి వారం స్వయంగా సమీక్షిస్తారని వెల్లడించారు. ప్రస్తుతం దేశంలోని విద్యుత్ కేంద్రాలు, రవాణాలో కలిపి 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు సిద్ధంగా ఉన్నాయని, ఇది దేశ అవసరాలకు ఏకంగా 85 రోజులకు సరిపోతుందని భరోసా ఇచ్చారు. గతంలో మన దేశంలో ఇన్ని నిల్వలు ఉన్నా విదేశాల నుండి బొగ్గు దిగుమతి చేసుకునేవారని.. మోదీ తెచ్చిన స్వదేశీ ఉత్పత్తి సంస్కరణల వల్ల గతేడాది బొగ్గు దిగుమతులు 4 శాతం తగ్గాయని, దీని ద్వారా దేశానికి ఏకంగా రూ. 60,000 కోట్ల విలువైన విదేశీ మారక ద్రవ్యం ఆదా అయిందని వివరించారు. ట్రక్కుల రవాణా వల్ల జరిగే కాలుష్యం, అధిక ఖర్చును తగ్గించేందుకు గనుల వద్దే నేరుగా రైల్వే లైన్లు వేసే 'ఫస్ట్ మైల్ కనెక్టివిటీ'ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆన్‌లైన్ వేలం విధానం ద్వారా ప్రైవేట్ రంగంలోనూ పారదర్శకతను పెంచామన్నారు.

**రూ. 46,000 కోట్ల ప్రోత్సాహకాలతో 'కోల్ గ్యాసిఫికేషన్'**

బొగ్గు ద్వారా సిన్ గ్యాస్ ఉత్పత్తి చేసే 'కోల్ గ్యాసిఫికేషన్' విధానానికి మోదీ ప్రభుత్వం సంపూర్ణ ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తోందని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ. 46,000 కోట్ల భారీ ఇన్సెంటివ్‌లను ప్రకటించిందని కిషన్ రెడ్డి తెలిపారు. ఎరువులు, గ్యాస్ ఉత్పత్తి రంగాలలో భారతదేశం వంద శాతం 'ఆత్మనిర్భరత' సాధించాలనేది ప్రధాని మోదీ ముఖ్య సంకల్పమన్నారు. ఈ మహా యజ్ఞంలో ప్రైవేట్ రంగాన్ని భాగస్వామ్యం చేయడానికి ఈనెల జూన్ 11న హైదరాబాద్ వేదికగా 'కోల్ గ్యాసిఫికేషన్'పై ఒక భారీ జాతీయ రోడ్‌షో నిర్వహించబోతున్నామని ప్రకటించారు. దీని ద్వారా దేశంలోకి రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులు రాబోతున్నాయని, లక్ష మంది యువతకు కొత్త ఉద్యోగాలు లభించడంతో పాటు సుమారు రూ. 3 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

**మైన్ క్లోజింగ్ యాక్టివిటీలో గిన్నిస్ రికార్డే లక్ష్యం!**

"స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి గనుల నుండి బొగ్గు తీయడమే తప్ప.. ఆ తర్వాత పాడుబడిన ఆ గలను పర్యావరణ హితంగా పూడ్చే ఆలోచన ఏ ప్రభుత్వాలూ చేయలేదు. గతంలో వదిలేసిన ఇలాంటి 147 పాడుబడిన బొగ్గు గనులు పర్యావరణానికి శాపంగా మారాయి. ప్రధాని మోదీ ఆదేశాల మేరకు దేశంలోనే తొలిసారిగా అత్యంత శాస్త్రీయ పద్ధతిలో 'మైన్ క్లోజింగ్ యాక్టివిటీ'ని ప్రారంభించాం. 2028 నాటికి ఈ పాడుబడిన గనులన్నింటినీ పూర్తిగా మూసివేయాలని నిర్ణయించాం" అని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. ఈ పనుల పర్యవేక్షణ కోసం దేశంలోని 600 జిల్లాలలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. పర్యావరణంపై తనకున్న నిబద్ధతతో ఒక కోల్ బ్లాక్‌ను స్వయంగా తాను దత్తత తీసుకున్నానని వెల్లడించారు. ఈ మైన్ క్లోజింగ్ ప్రక్రియ ద్వారా అంతర్జాతీయంగా 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' సాధించడమే తన ప్రధాన ఆకాంక్ష అని, పాడుబడిన ఈ గనులను అందమైన జలాశయాలుగా, సోలార్ పవర్ పార్కులుగా మారుస్తున్నామని తెలిపారు.

**21వ శతాబ్దం 'క్రిటికల్ మినరల్స్' ఎకానమీ!**

మైనింగ్ ద్వారా వచ్చే లాభాలలో 90 శాతం వాటా నేరుగా రాష్ట్ర ప్రభుత్వాలకే అందుతుందని, మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల సంక్షేమం కోసం మోదీ ప్రభుత్వం ప్రత్యేకంగా 'డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్' (డీఎమ్ఎఫ్) నిధులను ఏర్పాటు చేసిందని కిషన్ రెడ్డి వివరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల నేడు భారత్ అల్యూమినియం, స్టీల్ ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా నిలిచిందన్నారు. అయితే, భవిష్యత్ అవసరాలకు అత్యంత కీలకమైన 'క్రిటికల్ మినరల్స్' (వ్యూహాత్మక ఖనిజాలు) విషయంలో మన దేశం వెనకబడి ఉందని, ప్రస్తుతం మనం 93 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 20వ శతాబ్దం ఆయిల్ ఎకానమీ ఆధారంగా నడిస్తే.. ఈ 21వ శతాబ్దం ఖచ్చితంగా క్రిటికల్ మినరల్స్ ఎకానమీ ఆధారంగానే నడుస్తుందని, అందుకే దేశంలో రూ. 32,000 కోట్ల భారీ బడ్జెట్‌తో 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను ప్రారంభించామని ప్రకటించారు. దేశాలలో ఉన్న క్రిటికల్ మినరల్ బ్లాక్స్‌ను సొంతంగా కొనుగోలు చేయడానికి 'కాబిల్' అనే ప్రత్యేక ప్రభుత్వ రంగ సంస్థను ఏర్పాటు చేసుకున్నామని, దీని ద్వారా ఇప్పటికే అర్జెంటీనాలో 5 క్రిటికల్ మినరల్ బ్లాకులను భారతదేశం సొంతం చేసుకుందని వెల్లడించారు. ఇందుకు గాను 24 రకాల క్రిటికల్ మినరల్స్‌పై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పూర్తిగా మినహాయించిందన్నారు.

**సింగరేణి కార్మికులకు ప్రమాద బీమా రూ. 1.25 కోట్లకు పెంపు!**

మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ముక్కుసూటిగా సమాధానాలు ఇచ్చారు. తెలంగాణకు చెందిన సింగరేణి సంస్థలో అనవసర ఖర్చులను తగ్గించేలా చర్యలు తీసుకున్నామని, కార్మికులకు పూర్తి న్యాయం చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందన్నారు. కోల్ ఇండియాతో సమానంగా సింగరేణి కార్మికులు, ఉద్యోగుల ప్రమాద బీమా పరిహారాన్ని గతంలో ఉన్న రూ. 30 లక్షలు, రూ. 40 లక్షల నుండి ఏకంగా రూ. 1.25 కోట్లకు పెంచామని స్పష్టం చేశారు.

**2028లో బీజేపీ రాగానే సింగరేణి కార్మికులకు ఐటీ మినహాయింపు!**

"గతంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో నేను స్వయంగా సింగరేణి బొగ్గు గనుల పరివాహక ప్రాంతాలలో యాత్రలు చేశాను. నాటి నుండి నేటి వరకు సింగరేణి కార్మికులు పడుతున్న కష్టాలను నేను కళ్లారా చూశాను. అందుకే తెలంగాణలో భవిష్యత్తులో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికులందరికీ వారి జీతాలపై ఆదాయపు పన్ను (ఐటీ) పూర్తిగా మినహాయింపు ఇస్తానని నేను నాడు భరోసా ఇచ్చాను. ఈ విషయమై గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలను కోరినా వారు పట్టించుకోలేదు. రాబోయే 2028 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే, మొదటి క్యాబినెట్ లోనే సింగరేణి గని కార్మికులందరికీ ఆదాయపు పన్ను నుండి వంద శాతం పూర్తి మినహాయింపు ఇచ్చి తీరుతాం" అని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను క్రమంగా తగ్గిస్తూ అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను కేంద్రం ప్రోత్సహిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కమర్షియల్ మైనింగ్ విధానాల కారణంగా దేశంలో అదనంగా మరో 800 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగనుందని, దీనికి అనుగుణంగా మైనింగ్ రంగంలో యువతకు లక్షలాది కొత్త ఉద్యోగ అవకాశాలు లభించబోతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్‌ది హిట్లర్ మనస్తత్వమే

(మొదటి పేజీ తరువాయి)

ఈరోజు కూడా కాంగ్రెస్ పార్టీని ఒకే ఒక్క కుటుంబం నడుపుతోంది. అక్కడ అధ్యక్షుడు ఎవరైనా కావచ్చు కానీ, అన్ని నిర్ణయాలు మాత్రం ఒకే కుటుంబం చుట్టూ తిరుగుతున్నాయి. అదే నియంతృత్వ ధోరణిని, ఫాసిస్టు పోకడలను ఇవాళ తెలంగాణలో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా అమలు చేయాలని చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ హిట్లర్ మనస్తత్వంతో వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే 'జో హిట్లర్ కి చాల్ చలేగా, ఓ హిట్లర్ కి మౌత్ మరేగా' (ఎవరు హిట్లర్ బాటలో నడుస్తారో వారు హిట్లర్ లాగే పతనమవుతారు) అనే నినాదం స్పష్టంగా గుర్తొస్తోంది" అని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప్పల్ సభలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని, బీజేపీని టార్గెట్ చేస్తూ చేసిన వ్యాఖ్యలను ఆయన లెక్కలతో సహా తిప్పికొట్టారు. కాంగ్రెస్ పాలకుల అసహనం వెనుక ఉన్న రాజకీయ భయాన్ని ఎండగడుతూనే, కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అందించిన నిధుల వివరాలను మీడియా ముందు ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశ ప్రధాని నరేంద్ర మోదీ, గౌరవ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురించి మాట్లాడిన తీరు అత్యంత బాధాకరమని రాంచందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్య భారతీయ అత్యున్నత ప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వడంలో ఇబ్బంది పడుతూ, కేవలం ఢిల్లీలోని కాంగ్రెస్ కుటుంబానికి మాత్రం సాష్టాంగ పడి విధేయత చూపడం కాంగ్రెస్ నాయకత్వపు దిగజారిన ఆలోచనా విధానాన్ని బయటపెడుతోందన్నారు. ఓబీసీ వర్గానికి చెందిన ప్రధానమంత్రిని, దేశంలోనే తొలి గిరిజన మహిళ అయిన రాష్ట్రపతిని గౌరవించడం కూడా ఇబ్బందిగా భావించడం రేవంత్ రెడ్డి అహంకారానికి నిదర్శనమన్నారు.

**ధాన్యం కొనుగోళ్లలో సగానికి పైగా కేంద్రమే కొన్నది.. లెక్కలు ఇవే!**

ధాన్యం కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ప్రజలను ఘోరంగా తప్పుదోవ పట్టిస్తోందని రాంచందర్ రావు మండిపడ్డారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ), సెంట్రల్ ఫుడ్ గ్రెయిన్స్ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్న అధికారిక వివరాల ప్రకారం.. ఈ సీజన్ లో దేశవ్యాప్తంగా సేకరించిన మొత్తం ధాన్యం 104.41 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటే, అందులో కేవలం మన తెలంగాణ నుంచే కేంద్ర ప్రభుత్వం ఏకంగా 55.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. అంటే దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం సేకరించిన మొత్తం ధాన్యంలో సగానికి పైగా వాటా ఒక్క తెలంగాణ రైతుల నుంచే సేకరించబడింది. అలాగే కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) కింద దేశవ్యాప్తంగా రైతులకు కేంద్రం చెల్లించిన మొత్తం సుమారు రూ. 21,243 కోట్లు కాగా, అందులో కేవలం తెలంగాణ రైతులకు మాత్రమే రూ. 13,171 కోట్లకు పైగా నేరుగా చెల్లింపులు జరిగాయి. దేశవ్యాప్తంగా మద్దతు ధర ప్రయోజనం పొందిన రైతుల సంఖ్య 11.69 లక్షల మంది కాగా, అందులో 7,79,358 మంది ఒంటరిగా తెలంగాణ రైతులే ఉన్నారు.

"పరిస్థితి ఇంత స్పష్టంగా ఉంటే.. రాష్ట్ర ప్రభుత్వం తామేదో లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని డబ్బా కొట్టుకుంటోంది. నేను రేవంత్ రెడ్డిని అడుగుతున్నది ఒక్కటే.. మీరు ఎక్కడ కొనుగోలు కేంద్రాలు తెరిచారో, ఎక్కడ కొన్నారో గుండెల మీద చేయి వేసుకుని చెప్పండి? మార్చి 25 నుంచే ప్రారంభం కావాల్సిన కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ 25 వరకు మీ ప్రభుత్వం ప్రారంభించలేదు. నెల రోజులకు పైగా రైతులను కల్లాల వద్ద, ఐకేపీ కేంద్రాల్లో ఎండనక వాననక ఇబ్బంది పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రపోయింది, మంత్రులు నిద్రపోయారు, ముఖ్యమంత్రి నిద్రపోయారు. చివరకు రైతులు గోల చేసిన తర్వాత, భారతీయ జనతా పార్టీ రైతుల పక్షాన నిలబడి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష పోరాటాలు, ఆందోళనలు చేసిన తర్వాతే రేవంత్ ప్రభుత్వం నిద్రమత్తు వీడి ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించింది" అని రాంచందర్ రావు గుర్తు చేశారు. ఇప్పుడు మరో పంట సీజన్ కూడా ప్రారంభమై రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారని, కనీసం రాబోయే సీజన్‌లోనైనా ముందే మేల్కొని రైతులకు న్యాయం చేయాలని, కొనుగోలు ఏర్పాట్లు పక్కాగా చేయాలని డిమాండ్ చేశారు.

**అపాయింట్‌మెంట్ అడగకుండానే కిషన్ రెడ్డిపై ఆరోపణలా?**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అపాయింట్‌మెంట్ విషయంలో కూడా కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని రాంచందర్ రావు మండిపడ్డారు. "ఈ అపాయింట్‌మెంట్ వివాదంపై నేను స్వయంగా ముంబైలోని ఫడ్నవీస్ గారి కార్యాలయానికి (సీఎంఓ) ఫోన్ చేసి కనుక్కున్నాను. నెల రోజుల క్రితం తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారి తరఫున ఏదో ఒక సాధారణ అభ్యర్థన మాత్రమే వచ్చిందని వారు చెప్పారు. కానీ తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం నుండి దేవేంద్ర ఫడ్నవీస్ గారిని కలవడానికి ఎలాంటి అధికారిక అపాయింట్‌మెంట్ అభ్యర్థన అసలు రాలేదని వారు స్పష్టం చేశారు. ప్రజలు ముఖ్యమంత్రిగా ఎన్నుకున్న వ్యక్తి తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి తప్ప.. ముఖ్యమంత్రి చేయాల్సిన దౌత్యపరమైన పనులను కూడా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గారే చేయాలంటే ఎలా? రేవంత్ రెడ్డి తన బాధ్యతలు నిర్వర్తించడంలో విఫలమై, ఆ నెపాన్ని ఇతరులపై నెట్టేయడం సరైంది కాదు" అని హితవు పలికారు.

**మెట్రో, ఆర్ఆర్ఆర్ లకు నిధులిచ్చింది కేంద్రమే!**

కిషన్ రెడ్డి తెలంగాణను పట్టించుకోవడం లేదని రేవంత్ ఆరోపించడం హాస్యాస్పదమన్న రాంచందర్ రావు.. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వ పాత్రను రాష్ట్ర పాలకులు పూర్తిగా దాచిపెడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ గురించి మాట్లాడేటప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, కేంద్ర ప్రభుత్వ నిధుల గురించి ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. ఆర్థిక సహాయం, విధానపరమైన అనుమతులు, లాజిస్టిక్ మద్దతు.. ఇలా ప్రతి దశలోనూ కేంద్ర ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. హైదరాబాద్ మెట్రోకు శంకుస్థాపన చేసినది కూడా నరేంద్ర మోదీ గారేనని గుర్తు చేశారు. మెట్రో విస్తరణ ఆలస్యానికి రాష్ట్ర ప్రభుత్వం సమయానికి నివేదికలు, ప్రక్రియలు పూర్తి చేయకపోవడమే కారణమన్నారు. పాతబస్తీ ఫలక్‌నుమా వరకు మెట్రోను తీసుకెళ్లలేకపోయినవారు, మేడ్చల్ వైపు విస్తరించలేని వారు ఇప్పుడు కేంద్రాన్ని నిందించడం విడ్డూరంగా ఉందన్నారు. రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే భూసేకరణకు తన వాటా నిధులను విడుదల చేసిందని.. మరి రాష్ట్ర ప్రభుత్వం తన వంతు నిధులను ఎందుకు విడుదల చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. ఎంఎంటీఎస్, మెట్రో, రీజనల్ రింగ్ రోడ్.. ఇలా ప్రతి ప్రాజెక్టులోనూ కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను వంద శాతం నిర్వర్తించిందని, రాష్ట్ర ప్రభుత్వం చేసిన కాంట్రిబ్యూషన్ ఏమిటో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**కాళేశ్వరం లాగే పాలమూరు-రంగారెడ్డిని 'ఏటీఎం'గా మార్చారు!**

రాష్ట్రంలోని పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ హయాంలో భారీ అవినీతి జరుగుతోందనే గట్టి అనుమానాలు వ్యక్తమవుతున్నాయని రాంచందర్ రావు ఆరోపించారు. గత పాలకులు కాళేశ్వరం ప్రాజెక్టును తమ సొంత 'ఏటీఎం'గా మార్చుకుని ఏ విధంగా దోచుకున్నారో.. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును తమ ఢిల్లీ అవసరాల కోసం మరో కొత్త 'ఏటీఎం'గా మార్చే కుటిల ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ ప్రాజెక్టులు ప్రజల సాగునీటి కోసం కాదని, కేవలం పాలకుల పర్సంటేజీలు, కమిషన్ల కోసమే నడుస్తున్నాయనే అనుమానాలు ప్రజల్లో బలంగా ఉన్నాయన్నారు. కృష్ణా జలాల విషయంలో కూడా తెలంగాణకు రావాల్సిన న్యాయమైన నీటిని ఇతర రాష్ట్రాలకు మళ్లిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు మౌనం పాటిస్తోందో సమాధానం చెప్పాలన్నారు. మూసీ నది ప్రక్షాళనకు భారతీయ జనతా పార్టీ ఎంతమాత్రం వ్యతిరేకం కాదని.. మూసీ ఖచ్చితంగా శుభ్రం కావాలని, ప్రక్షాళన జరగాల్సిందేనని స్పష్టం చేశారు. కానీ అక్కడ నివసిస్తోన్న వేలాది మంది నిర్వాసితులకు సరైన ప్రత్యామ్నాయ సమస్యలు పరిష్కరించకుండా, అసలైన డీపీఆర్ (వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక)పై కనీస స్పష్టత లేకుండా.. కేవలం కాంట్రాక్టర్ల లబ్ధి కోసం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేయడం బీజేపీకి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు.






# హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉచిత అల్పాహారాన్ని అందిస్తున్నామని చెప్పారు. మహానగర పరిధిలో నిరుపేద, మధ్యతరగతి ప్రజల కోసం లక్ష ఎల్ఐజీ , ఎమ్ఐజీ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. గతంలో రాజీవ్ గృహకల్ప తరహాలోనే ప్రజలు నివసిస్తున్న ఉపాధి ప్రాంతాలకే అత్యంత సమీపంలో ఈ గృహాలను నిర్మించి అందిస్తామన్నారు. ఇందుకోసం ప్రభుత్వ భూములను ఆక్రమణదారుల నుంచి విముక్తం చేసి, ఆ స్థలాలను పేదల ఇళ్ల నిర్మాణానికే కేటాయిస్తామని ప్రకటించారు. మహిళల సంక్షేమం కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, 'ఇందిరా మహిళా శక్తి' పథకం ద్వారా నగరంలో 150 వాణిజ్య స్టాల్స్‌ను మహిళలకే కేటాయించినట్లు చెప్పారు. భవిష్యత్తులో మహిళలను పెట్రోల్ బంకుల యజమానులుగా తీర్చిదిద్దే సరికొత్త ఆర్థిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నట్లు సీఎం వెల్లడించారు.

**కేంద్ర నిధులపై బీజేపీ ఎంపీలను నిలదీసిన సీఎం**

తెలంగాణ నుంచి ఎన్నికైన బీజేపీ ఎంపీలు రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం నుండి నిధులు తీసుకురావడంలో ఎందుకు చొరవ చూపడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ అభివృద్ధికి అవసరమైన కేంద్ర నిధుల సాధనలో ముందుండాలని హితవు పలికారు. గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధిని ఆకాశానికెత్తే కొందరు నాయకులు, తెలంగాణలో తాము చేపడుతున్న మూసీ నది పునరుజ్జీవన, ప్రక్షాళన కార్యక్రమాలను రాజకీయ స్వార్థం కోసం ఎందుకు వ్యతిరేకిస్తున్నారని నిలదీశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో విపక్షాలు రాజకీయాలు పక్కనబెట్టాలన్నారు.

**అభివృద్ధిపై శ్వేతపత్రంతో బహిరంగ చర్చకు సిద్ధం**

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, కేంద్రంలోని పన్నెండేళ్ల బీజేపీ పాలనతో పాటు ప్రస్తుతం 30 నెలలు పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై తాము బహిరంగ చర్చకు సిద్ధమని ముఖ్యమంత్రి సవాల్ విసిరారు. ఎవరు తెలంగాణ రాష్ట్రానికి ఎంత అభివృద్ధి చేశారు, ఎవరు ఎన్ని నిధులు తెచ్చారో ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుందామన్నారు. రాబోయే 24 నెలల కాలాన్ని తమ ప్రభుత్వం పూర్తిగా అభివృద్ధి కార్యక్రమాలకే అంకితం చేస్తుందని, రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కలిసిరావాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. భారీ బహిరంగ సభలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, అనిల్ కుమార్ యాదవ్, శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి, అరికెపూడి గాంధీ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు మరియు వేలాది మంది నగర ప్రజలు పాల్గొన్నారు.

# 'ఏఐసీసీ' కాదు 'ఆల్ ఇండియా నాజీ పార్టీ'

- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఫాసిస్ట్ పోకడలు
- దిల్లీలో రాజ్యాంగ రక్షకుడిగా ఫోజులిచ్చే రాహుల్ ఎందుకు మౌనం?
- 'మొహబ్బత్ కీ దుకాన్' కాస్తా తెలంగాణలో 'హిట్లర్ కా మకాన్' అయిందా..?
- ప్రజాస్వామ్య నాయకుడు రాజనీతిజ్ఞుల నుంచి స్ఫూర్తి పొందుతాడు
- అధికారం తలకెక్కినవాడే నియంతలను మొక్కుతాడు
- రేవంత్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలపై 'ఎక్స్' వేదికగా కేటీఆర్ సంచలన పోస్ట్

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల బెంగళూరు సదస్సులో చేసిన తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనాయకత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) తన సిద్ధాంతాల ముసుగును తక్షణమే తొలగించి, అధికారికంగా తన పేరును "ఆల్ ఇండియా నాజీ పార్టీ"గా మార్చుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు, దానికి మద్దతుగా కాంగ్రెస్ అధిష్టానం వహిస్తోన్న మౌనం ఇప్పుడు జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద దుమారమే రేపింది.

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా కేటీఆర్ నేరుగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని టార్గెట్ చేస్తూ ధ్వజమెత్తారు. దిల్లీలో రాహుల్ గాంధీ ఇచ్చే జాతీయ నినాదం "మొహబ్బత్ కీ దుకాన్" (ప్రేమ దుకాణం) కాస్తా.. ఆయన స్వయంగా ఎంపిక చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి క్రూర నియంత వారసత్వాన్ని అక్కున చేర్చుకోవడంతో ఇక్కడ "హిట్లర్ కా మకాన్" (హిట్లర్ ఇల్లు) గా మారిపోయిందని కేటీఆర్ తీవ్రంగా ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నైతికతలోని ద్వంద్వ ప్రమాణాలను, కపటత్వాన్ని ఆయన తన పోస్ట్ ద్వారా తీవ్రంగా ఆక్షేపించారు.



**హిట్లర్ 'హంతక ముఠా' స్ఫూర్తి కావడంపై కేటీఆర్ ఫైర్!**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రభుత్వ పాలనా విధానాలకు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జరుగుతోన్న స్థానిక కూల్చివేతలకు జర్మన్ నియంత అడాల్ఫ్ హిట్లర్, ఆయన "హంతక ముఠా" (అస్సాసినేషన్ స్క్వాడ్) అయిన 'హైడ్రా' పేరు స్ఫూర్తి అని బహిరంగంగా పేర్కొనడంతో ఈ రాజకీయ వివాదం చెలరేగింది. అంతటితో ఆగకుండా, ఈ స్థానిక పేదల ఇండ్ల కూల్చివేతలను అంతర్జాతీయ యుద్ధ ప్రాంతాల విధ్వంసంతో ముఖ్యమంత్రి ఎంతో గర్వంగా పోల్చడం మేధావులు, ప్రతిపక్షాల తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ పరిణామాలపై గట్టిగా స్పందించిన కేటీఆర్.. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు వారి ఫాసిస్టు పాలనా ఆలోచనా విధానానికి నిదర్శనమని, ఇది దేశ పునాది విలువలపై, ప్రజాస్వామ్యంపై జరిగిన క్షమించరాని దాడి అని మండిపడ్డారు. ఈ విషయంలో రాహుల్ గాంధీ వహిస్తున్న వ్యూహాత్మక మౌనాన్ని తక్షణమే వీడాలని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రిని అధిష్టానం మందలించకపోతే, ఆ నియంతృత్వ పద్ధతులను రాహుల్ గాంధీ స్వయంగా సమర్థించినట్లే అవుతుందని హెచ్చరించారు.

**డియర్ రాహుల్ గాంధీ జీ.. దేశం మిమ్మల్ని గమనిస్తోంది!**

"డియర్ రాహుల్ గాంధీ జీ.. మీ 'మొహబ్బత్ కీ దుకాన్' అధికారికంగా 'హిట్లర్ కా మకాన్' అయిందా..? తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా క్రూర హిట్లర్‌ను కీర్తిస్తూ, అతని 'హంతక ముఠా'లను పాలనా స్ఫూర్తిగా పేర్కొంటుంటే.. మీరు మౌనంగా ఉంటూ, దిల్లీలో రాజ్యాంగానికి తానే స్వయంప్రకటిత రక్షకుడినని ఎలా చెప్పుకుంటారు?" అని కేటీఆర్ తన పోస్ట్‌లో నిలదీశారు. ఒక ప్రజాస్వామ్య నాయకుడు నిజమైన రాజనీతిజ్ఞుల నుండి, మహాత్మా గాంధీ, అంబేద్కర్‌ల నుండి స్ఫూర్తి పొందుతాడని.. కేవలం అధికారం తలకెక్కిన, పారనాయిడ్ పాలకుడు మాత్రమే క్రూర నియంతల నాజీ ఇతిహాసాల నుండి పాఠాలు వెతుక్కుంటాడని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర కాంగ్రెస్ నాయకత్వంపై విమర్శలను మరింత తీవ్రం చేస్తూ.. నియంతృత్వ పద్ధతులను పండగ చేసుకోవడం, స్థానిక నివాసాలను యుద్ధ ప్రాంతాల్లా మార్చడమే ఆ పార్టీ అసలు సిసలైన పాలనా బ్లూప్రింట్ అయితే, వారు సిద్ధాంతాల ముసుగును పూర్తిగా తొలగించుకోవాలని కేటీఆర్ సూచించారు. "నియంతృత్వ పద్ధతులను సెలబ్రేట్ చేసుకోవడం, స్థానిక కూల్చివేతలను అంతర్జాతీయ యుద్ధ ప్రాంతాల విధ్వంసంతో గర్వంగా పోల్చడమే మీ పార్టీ అసలు పాలనా విధానం అయితే.. ఏఐసీసీ తన సిద్ధాంతాల ముసుగును తీసివేసి 'ఆల్ ఇండియా నాజీ పార్టీ'గా పేరు మార్చుకోవాలి. మీ మౌనం ఈ వ్యాఖ్యలను అంగీకరించినట్లే అవుతుంది. దేశం మొత్తం మిమ్మల్ని గమనిస్తోంది" అని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఖండిస్తున్న తరుణంలో.. కాంగ్రెస్ హైకమాండ్ నిజంగానే నాజీ పద్ధతులను తమ పాలనా విధానంగా అంగీకరిస్తోందా లేదా అనేదానిపై తక్షణమే క్లారిటీ ఇవ్వాలని రాజకీయ విశ్లేషకులు డిమాండ్ చేస్తున్నారు.

# అగ్నివీర్ కి ఎంపికైన యువకులకు ఘన సన్మానం



- తెలంగాణ ఉద్యమకారుడు కొడగంటి వెంకటేష్
- సంజీవ్ మరియు శ్రీకాంత్‌లను ఆదర్శంగా తీసుకోవాలి
- విజయం గ్రామ యువతకు ఆదర్శంగా

**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల పరిధిలో లింగన్నపల్లి గ్రామానికి చెందిన యువకులు వల్లెపు సంజీవ, వడ్డె శ్రీకాంత్, భారత సైన్యంలో సత్తా చాటారు .ఈ సందర్భంగా వాళ్ళని ఘనంగా సన్మానించి తెలంగాణ ఉద్యమకారుడు కొడగంటి వెంకటేష్ మాట్లడుతూ..భారతదేశ అత్యున్నత సేవా సంస్థ అయిన భారత సైన్యంలో ఎంపిక కావడం మన గ్రామానికే కాకుండా మొత్తం ప్రాంతానికి గర్వకారణం. కఠోర శ్రమ, అచంచలమైన పట్టుదల, క్రమశిక్షణ,దేశభక్తి వంటి విలువలను ఆచరిస్తూ వారు ఈ అరుదైన విజయాన్ని సాధించడం అభినందనీయం అన్నారు.వారి విజయం గ్రామ యువతకు ఆదర్శంగా నిలిచి,ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రేరణగా ప్రతి ఒక యువత మారలి.

భారత సైన్యం అనేది దేశ సార్వభౌమత్వాన్ని, భద్రతను కాపాడే గొప్ప సంస్థ,సరిహద్దుల్లో శత్రువుల నుండి దేశాన్ని రక్షించడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, భూకంపాలు వంటి విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలుస్తుంది. దేశ సేవను అత్యున్నత ధర్మంగా భావించి విధులు నిర్వర్తించే సైనికులు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకులు. మన గ్రామ యువకులు నేటి యువత మొబైల్ ఫోన్లు,సామాజిక మాధ్యమాల ప్రభావంలో కాలాన్ని వృథా చేయకుండా, సంజీవ్ మరియు శ్రీకాంత్‌లను ఆదర్శంగా తీసుకొని విద్య, క్రీడలు, శారీరక దారుఢ్యం మరియు క్రమశిక్షణపై దృష్టి పెట్టాలి. దేశ సేవ పట్ల ఆసక్తి పెంపొందించుకొని సైన్యం, నౌకాదళం, వైమానిక దళం,పోలీస్ మరియు ఇతర రక్షణ రంగాలలో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.దేశ సేవ కోసం సైన్యంలో అడుగుపెడుతున్న వీరు తమ విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి కుటుంబ సభ్యులకు,గ్రామానికి, జిల్లాకు, రాష్ట్రానికి మరియు దేశానికి మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము. వారి సేవా ప్రస్థానం విజయవంతంగా సాగాలని, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు కొడగంటి వెంకటేష్,రవి,కృష్ణయ్య, శ్రీనివాస్, సంజీవ, రూప్ల మరియు యువజన సంఘం పాల్గొన్నారు.

## శాస్త్రీయంగా లేని ఎస్సీ వర్గీకరణతో
# మాలలకు అన్యాయం

### మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షులు గార్లపల్లి మల్లేశం

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రోస్టర్ విధానం జనాభా లెక్కలతో శాస్త్రీయంగా లేని ఎస్సీ వర్గీకరణ ద్వారా మాలల ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని జిల్లా ఉపాధ్యక్షులు గార్లపల్లి మల్లేశం ఆరోపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మాల సామాజిక వర్గాన్ని అన్ని రంగాలలో అణిచివేసే ప్రయత్నం జరుగుతుందని ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన పలు ఉద్యోగ నోటిఫికేషన్లలో మాల సామాజిక వర్గానికి చెందిన 26 కులాల వారికి అవకాశాలు లేకపోవడం,విద్యార్థులకు సీట్లు తగ్గడం, ఉద్యోగులకు ప్రమోషన్లు రాకపోవడం, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దక్కకపోవడం వంటి అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.మొన్న విడుదలైన డిప్యూటీ ఈవో నోటిఫికేషన్లులో మొత్తం 24 పోస్టులకు గాను ఎస్సీ గ్రూప్ 3 కేటగిరికి ఒక పోస్ట్ కూడా దక్కకపోవడానికి మాల మహానాడు తరపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మాల సామాజిక వర్గ జనాభా 18 లక్షల పైన ఉందని 15 సంవత్సరాల అనంతరం జనాభా సహాయ వృద్ధిని పరిగణలోకి తీసుకుంటే 25 లక్షలకు పైన ఉంటుందన్నారు. 2026 లెక్కల్లో మాల సమాజాన్ని ఉద్దేశపూర్వకంగా తగ్గించి చూపడం అన్యాయమన్నారు. రాను రాను ఇదేవిధంగా కొనసాగితే మాలల జీవితాలు చీకటమయం అవుతాయని, ఈ విధానాలపై మాలలు సంఘటితంగా పోరాడవలసిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

# హైకోర్టు ఆదేశాలను దిక్కరిస్తున్న మత్స్యశాఖ ఏడి పై కలెక్టర్ కు ఫిర్యాదు





**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చేపలు పట్టడానికి హైకోర్టు తీర్పు చెప్పిన, జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చిన మెదక్ జిల్లా ఇన్చార్జి మత్స్యశాఖ అసిస్టెంట్ ఏడి ఫిషరీస్ అనుమతులు ఇవ్వడం లేదని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో మండల పరిధిలోని గడి పెద్దాపూర్ మత్స్యకారులు ఫిర్యాదు చేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తమ గ్రామానికి చెందిన పెద్ద చెరువులో చేపలు పట్టే హక్కు దశాబ్దాలుగా తమ సొసైటీ కి కొనసాగుతుందని, కానీ పక్క గ్రామమైన కంసాన్పల్లి వారు ఇదే చెరువు పై తమకు కూడా హక్కు ఉందని చెబుతున్నారని ఇదెక్కడి న్యాయమని వారు ప్రశ్నించారు.దీనిపై గత కొన్ని రోజుల క్రితం హైకోర్టును ఆశ్రయించడంతో తమకు అనుకూలంగా తీర్పు కూడా వచ్చిందని, హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఫిషరీస్ వెంటనే పెద్ద చెరువులో చేపలు పట్టాలని తమకు చెప్పి, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి తమకు చేపలు పట్టడానికి అనుమతులు ఇవ్వడం లేదని వారు ఆరోపించారు. సంబంధిత మత్స్యశాఖ అధికారులు కొందరు తప్పుడు రిపోర్టులు సృష్టించి, తమకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఈ చెరువు పై పూర్తి హక్కు తమ గ్రామానికి ఉందని వారు పేర్కొన్నారు. తమ గ్రామ సొసైటీ నుండి 45 కుటుంబాలు చేపలు పట్టి జీవనోపాధి పొందుతున్నామని తమ పొట్ట కొట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. హైకోర్టు ఆదేశాలను మత్స్యశాఖ ఏడి వెంటనే అమలు చేయాలని వారు కోరారు.ఈ సమస్య పరిష్కారానికి పోలీసు అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వీరి న్యాయమైన హక్కులకు అల్లాదుర్గం అసెంబ్లీ సాధన సంఘం అధ్యక్షులు బ్రహ్మం సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో గడి పెద్దాపూర్ మత్స్యశాఖ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 'బతుకుదెరువు'షాట్ ఫీలింగ్
# షూటింగ్ కు శ్రీకారం

- గ్రామీణ జీవన పోరాటాలే కథాంశం
- సామాజిక సమస్యలపై పదునైన సందేశం

**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండల పరిధిలోని గురుజువాడ గ్రామంలో సోమవారం సినీ సందడితో కళకళలాడింది. గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, జీవన పోరాటాలు,సామాజిక సమస్యలను ప్రతిబింబించే 'బతుకుదెరువు'షార్ట్ ఫిల్మ్ షూటింగ్ గ్రామ సర్పంచ్ మ్యాతరి ప్రియాంక రాజేందర్ ఆధ్వర్యంలో ఘన ప్రారంభమైంది. శ్రీహాన్ ఫిలిమ్స్ ప్రొడక్షన్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ లఘు చిత్రం సమాజంలోని వాస్తవ పరిస్థితులను వెండితెరపై ఆవిష్కరించే ప్రయత్నంగా నిలవనుందని చిత్ర బృందం తెలిపింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో నిరుద్యోగం, పేదరికం, కుటుంబ బాధ్యతలు, జీవన పోరాటం వంటి అంశాలను హృద్యంగా చూపించనున్నట్లు వెల్లడించారు.షూటింగ్ ప్రారంభ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ప్రియాంక రాజేందర్,ఉప సర్పంచ్ సాయి కుమార్, హాజరై చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి సామాజిక సందేశాత్మక చిత్రాలు యువతలో అవగాహన పెంచడంతో పాటు గ్రామీణ వాస్తవాలను సమాజానికి తెలియజేస్తాయని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నిర్మాత, సినిమాటోగ్రాఫర్ చంద్రశేఖర్ గిద్దలమారి,దర్శకుడు కులకర్ణి విష్ణుకాంత్ మాట్లాడుతూ..సమాజంలో నిత్యం చోటుచేసుకునే సంఘటనలను కథాంశంగా తీసుకుని చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన పాత్రల్లో శంకర్, ఉమారాణి, నర్సింలు నటిస్తుండగా, ప్రభాకర్, కాశీనాథం అసిస్టెంట్ కెమెరామెన్‌లుగా వ్యవహరిస్తున్నారు.త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న 'బతుకుదెరువు' షార్ట్ ఫిల్మ్ సామాజిక చైతన్యాన్ని పెంపొందించే సందేశాత్మక చిత్రంగా నిలుస్తుందని చిత్ర యూనిట్ ఆశాభావం వ్యక్తం చేసింది.




## విత్తన దుకాణాలను తనిఖీ చేసిన ఆత్మ పిడి సరిత



**కూసుమంచి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** కూసుమంచి మండలంలోని కూసుమంచి గ్రామంలో విత్తన దుకాణాలను ఆత్మ పిడి సరిత,కూసుమంచి సీఐ సంజీవ్, టాస్క్ ఫోర్స్ టీం ఎస్ఐ నాగరాజు,మరియు మండల వ్యవసాయ అధికారి వాణి సంయుక్తంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వారు విత్తన లైసెన్స్, విత్తన స్టాక్ రిజిస్టర్,ఇన్ వాయిస్, బిల్ బుక్, సోర్స్ సర్టిఫికెట్లను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. విత్తనాలకు ఎటువంటి కృత్రిమ కొరత సృష్టించరాదని, రైతులకు అందుబాటులో మేలైన విత్తనాలను ఉంచాలని నకిలీ విత్తనాలు అమ్మితే కఠినచర్యలు ఉంటాయి అని సూచించారు.

## నిజాంపేటలో ఘనంగా చేప ప్రసాదం పంపిణీ



**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నారాయణఖేడ్ మండలంలోని నిజాంపేట గ్రామంలో సోమవారం చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.ఈ సందర్భంగా నిర్వాహకుడు తడకంటి పర్వ గౌడ్ మాట్లాడుతూ..తమ పూర్వీకుల కాలం నుంచి చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. చేప ప్రసాదం తీసుకోవడం వల్ల దగ్గు, ఉబ్బసం, అస్తమా వంటి శ్వాస సంబంధిత సమస్యలకు ఉపశమనం లభిస్తుందని ప్రజల విశ్వాసమని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఈ కార్యక్రమానికి దాదాపు వెయ్యి మందికి పైగా హాజరవుతారని చెప్పారు. చేప ప్రసాదం తీసుకున్న వారు కొద్ది రోజుల పాటు పులుపు, తీపి పదార్థాలను తక్కువ మోతాదులో తీసుకోవాలని సూచించారు.ఈ ప్రసాదం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో లింగ గౌడ్,శంకర్ గౌడ్, నాగరాజ్ గౌడ్,వెంకట్ గౌడ్,సాయిబాబా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బూరుగుపల్లిలో ఉచిత వైద్య శిబిరం..80 మందికి వైద్య సేవలు

- మమత హాస్పిటల్ వైద్య బృందం సేవలు..గ్రామ ప్రజల నుంచి హర్షం




**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో బూరుగుపల్లి గ్రామంలో సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పట్లోళ్ల వరప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో బాచుపల్లికి చెందిన మమత హాస్పిటల్ వైద్య బృందం ఈ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించింది.ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్, డాక్టర్ బిందుప్రియతో పాటు సిబ్బంది అనంతరావు, స్రవంతి గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు.శిబిరంలో సుమారు 80 మంది గ్రామస్తులు పాల్గొని వైద్య సేవలను పొందారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం వల్ల ప్రజలకు సమయానుకూలంగా వైద్య సేవలు అందడంతో పాటు ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని సర్పంచ్ వరప్రసాద్ రెడ్డి తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ నాగేందర్, గ్రామ పెద్దలు,ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు పాల్గొని శిబిరం విజయవంతానికి సహకరించారు.గ్రామ ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన మమత హాస్పిటల్ యాజమాన్యానికి మరియు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- మండల అధ్యక్ష కార్యదర్శులు చిట్టూరి వెంకన్న,తోటకూరి రాజశేఖర్

**కూసుమంచి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఈనెల 10వ తేదీన ముదిగొండ మండలం వెంకటాపురం గ్రామంలో జరిగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 25వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు చిట్టూరి వెంకన్న, తోటకూరి రాజశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని పద్మారెడ్డి భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్నవారు మాట్లాడుతూ..ఈ మహా సభలకు ఆల్ ఇండియా వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్,వ్యవసాయ కార్మిక సంఘం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నారని తెలియజేశారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సంఘం వ్యవసాయ కార్మిక సంఘం అని, ఉపాధి హామీ కార్మికుల హక్కుల కోసం, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలను రద్దు చేయాలని,వ్యవసాయ కార్మికుల కోసం, చిన్న సన్న కారు రైతాంగం కోసం మరెన్నో పోరాటాలు నిర్వహించిన సంఘం వ్యవసాయ కార్మిక సంఘం అని తెలియజేశారు.ఈ




జిల్లా మహాసభలకు ప్రజలు,వ్యవసాయ కార్మికులు,పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బడిబాటలో జోష్.. ప్రభుత్వ బడుల వైపు విద్యార్థుల అడుగులు

- పిల్లల చేరికలపై గ్రామస్తులకు అవగాహన
- ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను వివరించిన ప్రధానోపాధ్యాయులు ఆకుల ప్రభు





**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని గురుజువాడ గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు తదితర సౌకర్యాల గురించి గ్రామస్తులకు వివరించారు. గ్రామంలోని ప్రతి చిన్నారి ప్రభుత్వ పాఠశాలలో చేరేలా కృషి చేస్తూ ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు.అలాగే పనికి ఆహార పథకం ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికులకు కూడా ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను తెలియజేస్తూ తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఆకుల ప్రభు మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీఆర్పీ యాదయ్య,ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com